నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, మే 19 : గంగస్థాన్ ఫేస్-2 పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తోట రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డైనేజీ నిర్మాణంలో అడ్డువస్తున్న 11 కేవీ, ఎల్‌టీ లైన్లను సరిచేయనున్న నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ధర్పల్లి, మే 19 : మండలంలోని సీతాయిపేట్ గ్రామపరిధిలో ఉన్న పాత పెద్దమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ తాళాలు పగలగొట్టిన దుండగులు.. ఆలయంలోని అమ్మవారి మంగళసూత్రం, బంగారంతో చేయించిన కన్నులు, తిలకంతోపాటు హుండీని ఎత్తుకెళ్లారు. ఉదయం తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన భక్తులు చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

22న మండల సర్వసభ్య సమావేశం

ధర్పల్లి, మే 19 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22న ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

భక్తితోనే ముక్తి

సుభాష్‌నగర్, మే 19 : భక్తితోనే ముక్తి లభిస్తుందని ప్రముఖ ధార్మిక వేత్త స్వామి బ్రహ్మానంద సరస్వతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజం ప్రాంగణంలో దివ్య మానవ నిర్మాణ విధి అంశంపై ఆయన ఆదివారం ప్రవచనాలు చేశారు. అన్ని జన్మలకన్నా మానవ జన్మ ఉత్తమమైందని, అలాంటి జన్మను సత్కర్మలతో సార్థకం చేసుకోవాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ ప్రతినిధులు వేదమిత్ర, కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం అభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా కార్యదర్శికి విరాళం అందిస్తున్న అభినయ్

ముప్కాల్, మే 19: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ మినీ స్టేడియానికి పన్నీరు అభినయ్ తనవంతు సహకారంగా రూ.5వేల విరాళాన్ని జిల్లా కబడ్డీ కార్యదర్శి కే.గంగాధర్‌కు అందజేశారు. ప్రతి యువకుడూ మినీ స్టేడియం అభివృద్ధికి ముందుకు రావాలని గంగాధర్ కోరారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలి'

వేల్పూర్, మే 19: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మొండి అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రకారం రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు భోగ్ భండార్, అన్నదానం

ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న బంజారా దంపతులు

ఏర్గట్ల, మే 19: మండలంలోని బట్టాపూర్ గిరిజన తండాలో సంత్ సేవాలాల్, జగదాంబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయం వద్ద హోమం నిర్వహించారు. సోమవారం భోగ్ భండార్, ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని సంఘ పెద్ద భూక్యా తిరుపతినాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, సంఘ సభ్యులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలిరావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

నూతన సభ్యులను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

భీమ్‌గల్, మే 19: భీమ్‌గల్‌లోని స్వర్ణకార వ్యాపార సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకం నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా మంచిర్యాల గణేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద శ్యామ్ సుందర్, సహాయ కార్యదర్శిగా కందకుర్తి గంగాదాస్, కోశాధికారిగా తోగిటి వేణు, సహాయ కోశాధికారిగా గజ్జల శివను ఎన్నుకున్నారు. సలహాదారులుగా మంచిర్యాల రమేశ్, మంచిర్యాల రవీందర్, చిలివేరి శ్రీనివాస్, శ్రీపాద రాంకిషన్, ఎంఎల్ స్వామి, కత్రాజీ నర్సింహాచారిని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను సంఘం ప్రతినిధులు సత్కరించారు.

గోదావరి పుష్కరక్షేత్రంలో..

భక్తుల గొంతెండుతోంది

- ఏడాది నుంచి నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు
- ఉన్నతాధికారులు స్పందించాలని భక్తుల వేడుకోలు

గోదావరినది మధ్య నుంచి నీటిని తీసుకువస్తున్న భక్తులు

కందకుర్తి పుష్కర క్షేత్రంలో నిరుపయోగంగా తాగునీటి ట్యాంక్

రెంజల్, మే 19: మండలంలోని కందకుర్తి సమీపంలో ప్రవహించే గోదావరి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలో తాగునీటి సరఫరా లేక భక్తుల గొంతెండుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులు ఏడాది నుంచి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తెలంగాణలో గోదావరి, హరిద్రా, మంజీరా నదులు ఒకే చోట కలిసి ప్రవహించే త్రివేణి సంగమ క్షేత్రంలో అమావాస్య, పౌర్ణమి, పర్వదినాల్లో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకునేందుకు చుట్టు పక్కల గ్రామాల భక్తులతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. వేసవిలో గోదావరినదిలో ఆశించిన స్థాయిలో నీరు లేదు. భక్తులు వంట చేసుకునేందుకు, దాహార్తి తీర్చుకునేందుకు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. భక్తుల కష్టాలు తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ అసద్‌బేగ్ ప్రత్యేక చొరవ తీసుకొని 14వ ఆర్థిక సంఘం నిధులతో పుష్కర క్షేత్రంలో నాలుగు మినీ ట్యాంక్‌లను నిర్మించారు. మినీ ట్యాంక్‌లకు నీరు సరఫరా చేసే పైపులైన్ పనులు పూర్తయ్యాయి. కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో ట్యాంక్‌పై కప్పు, కుళాయిలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు.

నీటి సమస్య పరిష్కరించాలి

గోదారమ్మకు తెప్పలు వదిలేందుకు నైవేద్యం, పిండి వంటలు వండేందుకు నీటి కోసం నదిలో దిగాల్సిన పరిస్థితి ఉంది. వేసవి కావడంతో గోదావరి మధ్య ఉన్న నీటిని తెచ్చుకొని వినియోగించుకుంటున్నాం. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించాలి. భక్తుల కోసం ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్‌లను ఉపయోగంలోకి తీసుకురావాలి.

- పుష్పలత, భక్తురాలు, నిజామాబాద్

నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం -నిజామాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 11 మండలాలకు చెందిన పదోతరగతి విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. -ఖలీల్‌వాడి, మే 19

పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలీ విద్యార్థులకు కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. కమిటీ ప్రతినిధులు పురస్కారాలు అందజేశారు. - ఖలీల్‌వాడి, మే 19

ఘనంగా పోచమ్మ పండుగ

డిచ్‌పల్లి/ ఇందల్వాయి/ సిరికొండ, మే 19 : డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, దూస్‌గాం, ఘన్‌పూర్ గ్రామాల్లో పోచమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాలను గ్రామాల ప్రధానవీధుల్లో డప్పువాయిద్యాల మధ్య ఊరేగించి గ్రామదేవతలకు సమర్పించారు. గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం వీడీసీల ఆధ్వర్యంలో పండుగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో గ్రామదేవతలకు వీడీసీ ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్రామదేవతలకు జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పణ, బలిహరణం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తేలు విజయ్, ఎంపీటీసీ కచ్చకాయల శ్రీనివాస్, ఎల్ఐసీ గంగాధర్, రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలోని చిన్నవాల్గోట్, న్యావనంది గ్రామాల్లో పోచమ్మ పండుగను నిర్వహించారు. అన్ని కుల సంఘాల వారు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. సిరికొండ మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై గంగమ్మ తల్లి ఆలయంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బోనాలు తీసి అమ్మవారికి సమర్పించారు.

లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గం

కంఠేశ్వర్, మే 19 : నిజామాబాద్ లారీ ఓనర్స్, బిల్డింగ్ మెటీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని జనార్దన్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.వెంకటరాములు, జనరల్ సెక్రటరీగా లింగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా ఖయ్యూం, సలహాదారుడిగా డి.ప్రేమ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ నగరంలో జీరో ఇసుక రాకుండా కృషి చేస్తామని, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక సరఫరా చేస్తే వాహనాలను ప్రభుత్వ అధికారులకు అప్పగిస్తామని, లారీ ఓనర్లు అందరూ వే బిల్స్‌తోనే ఇసుక సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో పవన్‌రెడ్డి, జమీల్, దేవీదాస్. ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్, మే 19 : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని స్థానిక అయ్యప్ప ఆలయంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మూఢ శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శిగా మల్లిపెద్ది వంశీధర్, కోశాధికారిగా మధు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ కార్యవర్గ సభ్యులు పోతుగంటి గంగాధర్ తెలిపారు. సమావేశంలో ఇందూరు అయ్యప్ప ఆలయ కార్యదర్శి ధనుంజయ్ గుప్తా, గురుస్వామి కోవూరి గుండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీలపై పోలీసుల విచారణ

మోర్తాడ్, మే19: ఇటీవల మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో దొంగతనాలు జరిగాయి. చోరీలకు సంబంధించి అందిన పక్కా సమాచారం మేరకు ఓ అనుమానితుడిని కమ్మర్‌పల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు అనుమానితుడిని ఆలయాల్లో జరిగిన వరస దొంగతనాలకు కారకులు ఎవరు అనే విషయాన్ని ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద నుంచి ఆలయాలకు సంబంధించిన ఇత్తడి, రాగి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మోర్తాడ్ శివారులోని పెద్దమ్మ ఆలయం, తిమ్మాపూర్‌లో పెద్దమ్మ ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో చోరీలు జరిగాయి. మోర్తాడ్ మండలంతో పాటు ఇతర మండలాల్లోని ఆలయాల్లోనూ చోరీలు జరిగాయి. వరుస చోరీలకు పాల్పడ్డవారు ఒక మూఠాగా ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

'ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించండి'

మోర్తాడ్/ ఆర్మూర్‌టౌన్, మే19: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మోర్తాడ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. అన్ని రకాలు సదుపాయాలు కళాశాలలో ఉన్నాయని, ప్రభుత్వం అందించే పథకాలు విద్యార్థులకు అందుతాయని చెప్పారు. తల్లిదండ్రులు ఈవిషయాన్ని గుర్తించి విద్యార్థులను కళాశాలలో చేర్పించేలా చూడాలని కోరారు. కళాశాలకు వచ్చి వివరాలు తెలుసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ సూచించారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని కోరుతూ ఆర్మూర్ మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. అధ్యాపకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ సుర్బిర్యాల్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సుర్బిర్యాల్ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకుడు

మోర్తాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

గోదావరిలో మృతదేహాలు లభ్యం

రెంజల్, మే 19: మండలంలోని కందకుర్తి గోదావరినదిలో మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దులో వేర్వేరు చోట్ల ఆదివారం సాయంత్రం రెండు మృతదేహాలు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా అలూర్ గ్రామానికి చెందిన యువకుడు ఈతకు వెళ్లి నీట మునిగి మృతిచెందగా కుటుంబీకుల సమాచారం మేరకు ధర్మాబాద్ పోలీసులు మృతదేహాలను గుర్తించి పంచనామా నిర్వహించారు. తెలంగాణ భూభాగంలో రెండు రోజుల క్రితం నీటిలో పడి మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి వయస్సు (55) ఉంటుందని రెంజల్ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

బోధన్, మే19: పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా స్థానిక మృతదేహాన్ని పోలీసులు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలోని మార్చురీలో భద్రపరిచారు. సదరు వ్యక్తి అమ్దాపూర్ గ్రామానికి చెందిన అనాథ అని తెలియడంతో స్థానిక నాయకుడు ఎస్.హరికాంత్‌చారి అంత్యక్రియలను నిర్వహించారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘననివాళి

ఖలీల్‌వాడి/ ఆర్మూర్, మే 19 : జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెట్టిచాకిరి వ్యవస్థ, భూస్వాములకు వ్యతిరేకంగా సుందరయ్య పోరాటం చేయడంతోపాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, గంగాధర్, సుజాత, విఘ్నేశ్, సిర్ప లింగం, రాములు, నర్సయ్య, అనసూయ, అనిత, ఉద్దవ్, దీపిక, విజయ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రీనగర్ కాలనీలో ఉన్న సీపీఎం కార్యాలయం వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

బోధన్ రూరల్, మే19: యువకులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో నిర్వహించిన పెగడాపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై బహుమతులను ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ఐలాపూర్ టీమ్‌కు గ్రామానికి చెందిన పోతారెడ్డి రూ.25,555, రన్నర్ టీమ్‌కు దొన్కంటి రాజారెడ్డి రూ.12,255 ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ జయశ్రీభూమ్‌రెడ్డి, మేడి రవి, మద్దిసాయిలు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



కార్యక్రమంలో పాల్గొన్న ముప్కాల్ జడ్పీహెచ్ఎస్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు



ధర్పల్లి జడ్పీహెచ్ఎస్ 2006-07 బ్యాచ్ విద్యార్థులు

కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

రావూజీ సంఘం 2001-02 బ్యాచ్ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముప్కాల్/మాక్లూర్/ ఖలీల్‌వాడి/ ధర్పల్లి, మే 19 : పలు పాఠశాలల్లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ వివరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. ముప్కాల్ జడ్పీహెచ్ఎస్‌లో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1999-2000 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న రావూజీ సంఘం ఉన్నత పాఠశాలలో 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్పల్లి మండలకేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో చదివిన 2006-07 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హంసవాహిణి కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొని రోజంతా సందడిగా గడిపారు.